సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



అప్పన్నకు విశేషంగా తిరువీధి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం తిరువీధి విశేషంగా జరిగింది.



అమ్మదర్శనానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లిలోని నూకాంబిక ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

బొర్రా వెలవెల



అనంతగిరి: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఆదివారం వెలవెలబోయాయి. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో సందర్శిత ప్రాంతాలు కళ తప్పాయి. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు తిలకించేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. ఈ ఆదివారం గుహలను కేవలం 1500 మంది సందర్శించగా, రూ.1.29 లక్షల ఆదాయం వచ్చింది. జిప్‌లైన్‌పై 106 మంది విహరించగా రూ.53 వేల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.

శ్లాస్ పరీక్షకు ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్(హుకుంపేట): స్టేట్ లెవెల్ అచీవ్‌మెంట్ సర్వే(శ్లాస్) పరీక్షకు సంబంధించి ఎంపిక చేసిన 147 పాఠశాలల ఉపాధ్యాయులకు ఆదివారం విద్యాశాఖ శిక్షణ ఇచ్చింది. పాడేరులోని కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈనెల 16న జరిగే ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి కె.కృష్ణమూర్తి,ఐటీ సెల్ కో ఆర్డినేటర్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో అమానవీయ ఘటన

- శిశువు కళేబరాన్ని పీక్కుతిన్న కుక్కలు
- సగం కళేబరం ఆస్పత్రి మార్చురీకి తరలింపు

పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో ఆదివారం అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఏ తల్లి కన్న బిడ్డో కానీ వారం రోజుల వయస్సున్న ఆడ శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటన స్థానికుల కంట తడిపెట్టించింది. పాడేరు ఎంపీడీవో కార్యాలయానికి సమీపంలో రోడ్డు పక్కన ఆదివారం శిశువు కళేబారాన్ని కుక్కలు పీక్కు తినడం స్థానికులు చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే కుక్కలు నడుము నుంచి కింద భాగం వరకు పూర్తిగా తినేశాయి. మిగిలిన కళేబరాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. శిశువును ప్రసవించిన మహిళ కావాలనే బిడ్డను వదిలేసిందా లేకా మరేమైనా జరిగిందా అన్న వివరాలు తెలియరాలేదు. శిశువు కళేబరం బొడ్డు భాగంలో ఆస్పత్రి స్టిక్కర్ ఉండడంతో ఆ దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈవీఎంల తరలింపునకు పరిశీలన



మార్గాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సాయికుమార్

వై.రామవరం: సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని పాతకోట, గుర్తేడు పోలింగుబూత్‌ల నుంచి హెలికాప్టర్ ద్వారా ఈవీఎంలను తరలించనున్నారు. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల నుంచి హెలీప్యాడ్ వద్దకు ఈవీఎంలను తరలించే మార్గాన్ని ఆదివారం గుర్తేడు ఎస్ఐ పి.సాయికుమార్ పరిశీలించారు. ఇది సమస్యాత్మక ప్రాంతం కావడంతో ఈవీఎంలను హెలికాప్టర్‌లో తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంట్లో భాగంగా హెలికాప్టర్ నిలిపే స్థలానికి రోడ్డు మార్గంగుండా ఈవీఎంలను తరలించడానికి పాతకోట పంచాయతీ ప్రజల సహకారంతో మార్గాన్ని తనిఖీ చేశారు. దీంతో పాటు పాతకోట, గుర్తేడు పోలింగుబూత్‌లకు కల్పించవలసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు మారేడిమిల్లి సీఐ ఆర్.భీమరాజు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆ గ్రామ ప్రధాన రహదారిలోని అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో గుర్తేడు పోలీసు స్టేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం

- సీఎం జగన్‌పై హత్యాయత్నాన్ని ఖండించిన అభిమానులు, నేతలు
- పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు
- ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన హత్యాయత్నం ఘటనపై జిల్లాలో ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. ఆదివారం పలు ప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు చేసి సీఎం జగన్ గాయం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈ కుట్రలో తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు.

సాక్షి,పాడేరు: అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం జగన్మోహన్‌రెడ్డిపై దుండగులు హత్యాయత్నం చేయడం దారుణమని పాడేరు ఎమ్మెల్యే,వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పార్టీ నాయకులతో కలిసి స్థానిక పాతబస్టాండ్‌లో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, బస్సు యాత్రకు వస్తున్న ప్రజల మద్దతును చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ దాడి వెనుక చంద్రబాబు,పవన్‌కల్యాణ్‌ల పాత్రపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పద్ధతి మార్చుకోవాలని,లేని పక్షంలో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కడతారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం అవడం ఖాయమని తెలిపారు. పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని,హత్య యత్నం కోణంలో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సీఎం జగన్ కోలుకోవాలని పూజలు, ప్రార్థనలు

తీవ్రంగా గాయపడిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోలుకోవాలని, నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లికి పూజలు జరిపారు. స్థానిక మసీదు, చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు,పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్లు లకే రామసత్యవతి, రాజారావు, వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షురాలు ఎం.సరస్వతి, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, రామకృష్ణపాత్రుడు, కె.నరసింహమూర్తి, సల్ల చిట్టమ్మ,సన్యాసిరావు,మాజీ ఎంపీపీ రమణమూర్తి, సర్పంచ్‌లు బసవన్నదొర, చిట్టిబాబు, రాంబాబు, లక్ష్మణరావు, సన్నిబాబు, లింగమూర్తి, పార్టీ నాయకులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు,ఐశ్వర్యరాణి,పలాసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పద్మాపురం జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న అరకు అభ్యర్థి రేగం మత్స్యలింగం, వైఎస్సార్ సీపీ నేతలు

ఆంజనేయ స్వామి ఆలయంలో..

కొయ్యూరు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆదివారం నల్లగొండ ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ పాట్టిక పోతురాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు,ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, డౌనూరు ఎంపీటీసీ బి.అప్పారావు, సర్పంచ్‌లు కోడా రాజు,సోమన్నదొర, రీముల శ్రీను, బాలకృష్ణ, చందు,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాడి పిరికిపంద చర్య :

అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దాడి టీడీపీ గూండాల పనేనని, ఇది పిరికి పంద చర్య అని వైఎస్సార్ సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలో పద్మాపురం పంచాయతీ సినిమాహాల్ జంక్షన్ వద్ద పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి, అధికారంలోకి వస్తుందన్న భయంతోనే నీచమైన చర్యలకు దిగుతున్నారని చెప్పారు. ఇటువంటి దాడులకు భయపడేది లేదన్నారు. దోషులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, సత్రుగున్, రాంచందర్, మహిళా అధ్యక్షురాలు సుమిత్ర, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, సీనియర్ నాయకులు శెట్టి అప్పాలు, కమిడి అశోక్‌కుమార్, సాంబ, బాలరాజు, రాముర్తి, విజయ్‌కుమార్, గాసి, నర్సింగ్, అర్జున్, రాజ్‌కుమార్, అప్పాలస్వామి, యాసిన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

- అరకు ఎంపీ మాధవి



కొయ్యూరు: 'మేము సిద్ధం' బస్సు యాత్రకు వస్తున్న స్పందనను చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్లతో దాడి చేయించడం హేయమైన చర్యని అరకు ఎంపీ మాధవి అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దాడిని ఖండించారు. దేవుడి దయతో జగన్‌మోహన్‌రెడ్డి గాయంతో బయటపడ్డారని తెలిపారు. ప్రజలే ఆయనకు శ్రీరామరక్షగా ఉంటారని చెప్పారు.

ఇది చంద్రబాబు, పవన్‌ల కుట్ర

- అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం వెనుక చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల కుట్ర ఉందని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆరోపించారు. ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు,కుతంత్రాలకు పాల్పడినా వైఎస్సార్‌సీపీదే విజయమని తెలిపారు. చంద్రబాబు,పవన్‌లు తప్పుడు విధానాలు, హత్యా రాజకీయాలను మానుకోని పక్షంలో ప్రజలనుంచి తగిన గుణపాఠం తప్పదన్నారు. దాడిఘటనపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదబయలు, చింతపల్లి మాజీ ఎంపీపీలు జర్సింగి సూర్యనారాయణ,వంతాల బాబురావులు పాల్గొన్నారు.



నల్లగొండ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఇతర నేతలు







మోదమ్మకు పూజలు, మసీదు, చర్చిలో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు

అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం

కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని, ప్రతి ఒక్కరూ ఆయన జీవితం గురించి తెలుసుకోవాలని, ఆయన రచించిన భారత రాజ్యాంగం భావితరాలకు దిక్సూచి అని కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 113వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటంతో పాటు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహానికి కలెక్టర్ విజయసునీత, జేసీ భావన వశిష్ఠ,పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం నిర్మాణం చారిత్రాత్మకమని, అపర కుబేరుడైన, పేదవాడు అయిన సమస్యలు వచ్చినప్పుడు భారత రాజ్యాంగం వైపు చూస్తారని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జనార్దన్,జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, తహసీల్దార్ కల్యాణ్‌చక్రవర్తి, ఎస్‌డబ్ల్యూవోలు ఆనందరాజు,కన్నబ్బాయి,వీఆర్వోలు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.







డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ్, పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు

రాజకీయ నాయకుల సమక్షంలో భద్రపరిచిన అధికారులు

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించేందుకు పాడేరు నుంచి వచ్చిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్టు రంపచోడవరం సబ్‌కలెక్టర్, ఆర్వో ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆదివారం వాటిని భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడతూ ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు రెండు కంటైనర్లలో వచ్చినట్టు తెలిపారు. ఏఎస్పీ జగదీష్ అడహళ్ళి, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో సీల్ ఓపెన్ చేసి, వాటిని స్ట్రాంగ్ రూములలో భద్రపరిచినట్టు చెప్పారు. రంపచోడవరం చింతూరు డివిజన్లోని 11 మండలాల్లో 399 పోలింగ్ కేంద్రాలకు 518 ఈవీఎంలు, 518 వీవీ ప్యాట్లు, 518 బ్యాలెట్ యూనిట్లు, 518 కంట్రోల్ యూనిట్లు వచ్చినట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు ఎ.కృష్ణజ్యోతి, ఎండీ నజీమ్, డీటీలు ఎస్.వి.వి. సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, మూర్తి, సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐలు మోహన్‌కుమార్, వి.వెంకటేశ్వరరావు, రాజకీయ పార్టీల నాయకుల కొమ్మిశెట్టి బాలకృష్ణ, బొజ్జిరెడ్డి, మట్ల వాణిశ్రీ, చుక్కా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో మలేరియా మరణాలు సున్నా

ప్రతి ఏడాది గిరిజనాన్ని పొట్టన పెట్టుకునే మలేరియా మహమ్మారిని ప్రభుత్వం అదుపుచేసింది. గతంలో ఈ వ్యాధి ఎప్పుడు విజృంభిస్తుందో...ఎంతమందిని పొట్టన పెట్టుకుంటుందో తెలియని పరిస్థితిల్లో గిరిజనం బితుబితుకుమంటూ కాలం గడిపేవారు. ఈ వ్యాధి బారిన పడి జనం పిట్టల్లా రాలిపోయేవారు. ఐదేళ్ల ముందు వరకు పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో ప్రతి ఏడాదీ కనీసం 50 మందికి మలేరియాతో మృతిచెందేవారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు ఫలితమిచ్చాయి. జ్వరపీడితులకు తక్షణం వైద్యసేవలందించడంతో పాటు విస్తృతంగా పారిశుధ్య చర్యలు, దోమల నివారణ మందు పిచికారీ తదితర కార్యక్రమాలతో ఈ ఐదేళ్లలో ఒక్క మలేరియా మరణం కూడా నమోదు కాలేదు.



గిరిజనుని నివాసం వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- ఏటా దోమల నివారణ మందు పిచికారీ
- పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- విస్తృతంగా వైద్యఆరోగ్య కార్యక్రమాలు

సాక్షి,పాడేరు: గతంలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ, పారిశుధ్య కార్యక్రమాలు అంతంత మాత్రంగానే ఉండేవి. గిరిజనుల ప్రాణాలంటే గతంలో పాలకులకు లెక్క ఉండేది కాదు. 2012 నుంచి 2018 వరకు జిల్లాలో మలేరియా తీవ్రత అధికంగా ఉంది. మరణాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో జీవించే ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా ఏర్పడింది. సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశారు. గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి 50 కుటుంబాలకు గ్రామ వలంటీర్ల సేవలను అందుబాటులోకి తెచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పలు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతం చేసింది. మరోవైపు దోమల నివారణకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖ బృందాలు నిరంతరం పనిచేశాయి. 2022లో ఏజెన్సీ వ్యాప్తంగా 7,20,950 దోమ తెరలను ప్రభుత్వం పంపిణీ చేయడం మరింత మేలు చేసింది. దోమ తెరల వినియోగంపైన వైద్య బృందాలు, సచివాలయ ఉద్యోగులు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు ఎపిడమిక్ (వ్యాధుల) సీజన్‌గా ప్రభుత్వం గుర్తించి వైద్య ఆరోగ్య కార్యక్రమాలను చేపడుతోంది. 2019 నుంచి నుంచి దోమల నివారణతో పాటు మలేరియా తీవ్రతను అరికట్టడంలో మలేరియా, వైద్య ఆరోగ్యశాఖలు ఎంతో శ్రమించాయి. ప్రతి ఏడాది రెండు దఫాలుగా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ప్రతి గిరిజనుడు ఇంటి లోపల, బయట దోమల మందు పిచికారిని తప్పనిసరిగా చేయించుకోవాలనే నిబంధనను సచివాలయ ఉద్యోగులు అమలు చేశారు. గ్రామ వలంటీర్లు తమకు నిర్దేశించిన గిరిజన కుటుంబాల నివాసాల వద్ద దగ్గరుండి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఇంటింటా ఫీవర్ సర్వే కూడా విజయవంతంగా జరిగింది. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్య సిబ్బంది వెంటనే రక్త పరీక్షలు జరిపేవారు. మలేరియా, ఇతర జ్వరాలను నిర్ధారించి సకాలంలో వైద్య సేవలు అందించడంతో జ్వరపీడితులు కోలుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించడంతో మలేరియా వ్యాధితో ఎవరూ మృతి చెందలేదు.

సంవత్సరం	రక్తపూతలు	మలేరియా సేకరణ	మరణాలు కేసులు
2019	7,90,941	1,121	0
2020	6,12,917	1,280	0
2021	7,31,759	841	0
2022	7,09,124	830	0
2023	8,08,938	3,304	0
2024(మార్చి వరకు)	1,65,751	407	0



జ్వరపీడితుల నుంచి రక్తపూతలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

నేటి నుంచి దోమల నివారణ మందు పిచికారి

ఈఏడాది కూడా దోమల నిర్మూలన కార్యక్రమాలకు మలేరియా,వైద్య ఆరోగ్యశాఖలు చర్యలు చేపట్టాయి.

ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించింది. జిల్లాలో 1,774 మలేరియా పీడిత గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. ఈ గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి మొదట విడత దోమల నివారణ మందు పిచికారీని జిల్లా మలేరియాశాఖ ప్రారంభించనుంది. ఈఏడాది కూడా నూరుశాతం పిచికారీ పనులు విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమైంది.

మలేరియా నిర్మూలనకు కృషి



జిల్లా వ్యాప్తంగా 1,774 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం. ఇతర గ్రామాల్లో మలేరియా కేసులు నమోదైనా అక్కడ కూడా వైద్యబృందాలను అప్రమత్తం చేస్తున్నాం. జిల్లాలో మలేరియా నిర్మూలనకు కృషి చేస్తున్నాం. దోమల నివారణ చర్యలతో పాటు సంపూర్ణ పారిశుధ్యానికి సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. మలేరియా కేసులు నమోదైనప్పటికీ సకాలంలో వైద్యసేవలు అందించడంతో ఈఐదేళ్లలో ఆ వ్యాధితో మరణాలు నమోదు కాలేదు. ఈ ఏడాది కూడా మలేరియా నిర్మూలన లక్ష్యంగా దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపడుతున్నాం.

– ప్రసాద్, జిల్లా మలేరియాశాఖాధికారి

క్లుప్తంగా

వైభవంగా భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అడ్డతీగల: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన స్థానిక పవనగిరి క్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో లంకా అయ్యప్పశర్మ పౌరోహిత్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు కల్యాణ మహోత్సవాన్ని ఆలయ నిర్మాణకర్త, విగ్రహ దాత గొలగాని వెంకటరమణ,వరలక్ష్మి దంపతుల చేతుల మీదగా నిర్వహించారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి లక్ష్మణస్వామి

పాడేరు : అగ్నిప్రమాదాల నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బగ్గం లక్ష్మణస్వామి అన్నారు. రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. పాడేరు అగ్నిమాపకశాఖ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి, అగ్నిమాపక శాఖ పోస్టర్లను విడుదల చేశారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే అలసత్వం చేయకుండా సమీపంలో ఉన్న అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. పాడేరు అగ్నిమాపక శాఖ అధికారి కేపీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



గంగవరంలోని ప్రచారంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : గడప గడపకు సంక్షేమ పాలన అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని జడేరు కొరముగొంది , ఏటి పల్లి, చీడిపాలెం, కుసుమరాయి, ఆముదాలబందా రాజంపాలెం, పాత గంగవరం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన చేశారన్నారు. గిరిజన గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కోట్లాది రూపాయిలు ఖర్చు చేసినట్టు చెప్పారు. గంగవరం మండలంలో ఒక్క సంక్షేమ కార్యక్రమాల ద్వారా సుమారు రూ.135 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్టు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు సంక్షేమ పాలన అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎంతో కృషి చేశారన్నారు. రంచోడవరం నియోజకవర్గ అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. నేడు మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో ఉన్నాయన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చేశామన్నారు. గంగవరం సచివాలయం పరిధిలోని గంగవరం, ఆముదాలబంద పంచాయతీల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రూ. 13.85 కోట్లు, జడేరు సచివాలయం పరిధిలోని రూ.12 కోట్లు ఖర్చు చేసినట్టు ఎమ్మెల్యే ధనలక్ష్మి చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా, అరకు ఎంపీగా తనూజారాణిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ రత్నం , వైస్ ఎంపీపీ కె.రామతులసి, మోహనాపురం ఎంపీటీసీ వెంకటలక్ష్మి , కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, సర్పంచులు చోడి మల్లికార్జున్ దొర, రామలక్ష్మి, పాయం రాజమ్మ, కామరాజు దొర, మండల కన్వీనర్ అప్పలరాజు, మండల ఇన్‌చార్జి రఘునాథ్, సచివాలయ కన్వీనర్లు కృష్ణ, శ్రీను, వెంకటేశులు, వెంకటేశ్వర్లు , ఏసు, జగదీష్, బాబి, శివరామకృష్ణ, చంద్రరావు తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

సీఎంపై దాడిని ఖండించిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తీవ్రంగా ఖండించారు. ఆదివారం తన ఎన్నికల ప్రచారంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

ఎమ్మెల్సీ అనంతబాబు



దుశ్చర్తిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: నవరత్నాలు పథకాలు అమలు ద్వారా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటా వెలుగులు నింపారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు.అడ్డతీగల మండలంలోని దుశ్చర్తి,డి.రామవరం, అనుకులపాలెం, తుంగమడుగుల, రాయపల్లి, వీరవరం, దబ్బపాలెం-3 గ్రామాల్లో ఎమ్మెల్సీ అనంతబాబు ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థిని నాగులపల్లి ధనలక్ష్మి, ఎంపీ అభ్యర్థిని గుమ్మా తనూజారాణిలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వినూత్నమైన సంక్షేమ పథకాలు అమలుచేసి పేదల తలరాతలను మార్చిన వ్యక్తిగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి మనస్సుల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. అడ్డతీగల మండలంలో వివిధ పథకాల ద్వారా జగనన్న ప్రభుత్వం రూ.165 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసిందన్నారు. జగనన్న ప్రభుత్వం గిరిజనులకు కొండ పోడు భూములపై హక్కు కల్పించిందని, గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా గడప వద్దకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చిందన్నారు. 104,హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటుచేసి గ్రామస్థాయిలో వైద్య సేవలు మెరుగుపర్చారన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలతో నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ సలహాలు, సూచనలిస్తూ, పండించిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తూ పెట్టుబడి సహాయం కూడా చేస్తున్నారన్నారు.ఇంతలా ప్రజల కోసం అహర్నిశలు శ్రమపడిన ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకుని సంక్షేమ పాలన ఫలాలను అన్ని వర్గాలు పొందాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



అయితంశెట్టి రాము (ఫైల్)

అచ్యుతాపురం : తిమ్మరాజుపేటకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అయితంశెట్టి రాము విద్యుత్ ప్రమాదానికి గురై ఆదివారం మృతి చెందారు. కొండకర్లలో ఒక ప్రైవేట్ రిసార్టులో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్ తగిలి భవనం పై నుంచి కిందకు పడిపోయి మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హింసా రాజకీయాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: హింసా రాజకీయాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై శనివారం విజయవాడ సింగ్ నగర్ వద్ద జరిగిన రాళ్ల దాడిని ఖండిస్తూ ఆమె స్థానిక పార్టీ శ్రేణులతో మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక రాళ్ల దాడులకు ప్రతిపక్షాలు దిగుతున్నాయన్నారు. అన్ని సర్వేల్లోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే విజయం ఖాయమని తేల్చిచెప్పడాన్ని జీర్ణంచలేక ప్రతిపక్ష పార్టీలు జగనన్నపై హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో హింసాత్మక దాడులు జరగడానికి వీలులేదన్నారు. కాపు ఉద్యమనేత వంగవీటి రంగాను ఏ మాదిరిగా చంద్రబాబు హతమార్చారో అదే తరహాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేసేందుకు పన్నాగం జరిగిందన్నారు. ఈ దాడిపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్‌రాజు, ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్‌లు దురియా పుష్పలత, గెమ్మెల లలిత, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, ఎంపీటీసీలు మీనాకుమారి, నాయకులు సింహాచలం, రఘునాథ్, నూకరాజు, బుజ్జి, గంగన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు



ఎడ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్: పెంటసేరి కళ్లాల వద్ద గంగాలమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.అనంతరం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించడానికి గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి ముగ్గులు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గంగాలమ్మ ఆలయ సేవా కమిటీ, పెంటసేరి కళ్లాల ప్రజలు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా గుర్రప్పందాలు

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి పండగ సందర్భంగా ఆదివారం గుర్రప్పందాలు ఉత్సాహంగా నిర్వహించారు. పందేలు తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలైన లింగంపేట, తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి 13 గుర్రాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులను కమిటీ సభ్యులు ప్రదానం చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



పాడేరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నేతలు



తలారిసింగిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు, టీచర్లు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని రాజకీయ ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు పాతబస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులు పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి, విశ్వేశ్వరరాజులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా తామంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఎంతో న్యాయం జరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చట్టసభల్లో అవకాశం కల్పించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేశారన్నారు.డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు తగ్గట్టుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మాజీ ఎంపీపీలు సీదరి మంగ్లన్నదొర, ఎస్.వి.వి.రమణమూర్తి, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, రామకృష్ణపాత్రుడు, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, లక్ష్మణరావు, సన్యాసిరావు, నాయకులు దశమూర్తి, కన్నాపాత్రుడు, కోటిబాబు, సూర్యనారాయణ, రాంబాబు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు. తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి డీఈవో బ్రహ్మాజీరావు, హెచ్ఎంలు రీమలి జాన్, ప్రసాద్, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కృష్ణారావు, సూర్యనారాయణ, రామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గడ్డి మందు తాగి దివ్యాంగుడి మృతి



మృతి చెందిన రమణ

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన బండారు రమణ(66) గడ్డి మందు తాగి ఆదివారం మృతిచెందాడు. దివ్యాంగుడైన తాను కుటుంబానికి భారంగా మారినట్టు మనస్థాపానికి గురైన రమణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందును తాగాడు. ఇంటికి వచ్చిన భార్య లక్ష్మి అపస్మారక స్థితిలో ఉన్న భర్త రమణను గుర్తించి స్థానికుల సాయంతో కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకువెళ్లింది. అయితే అప్పటికే రమణ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కె.కోటపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు.

పాడి రైతుల అభ్యున్నతికి రాఘవరావు పరిశోధనలు దోహదం



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

పాయకరావుపేట : పశు పోషకులను సమాజంలో గౌరవ స్థానంలో నిలబెట్టడానికి డా.రాఘవరావు చేసిన కృషి అమోఘమైనదని రాష్ట్ర విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా.మన్మోహన్ సింగ్ అన్నారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీ ప్రకాష్ విద్యాసౌధంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో పశుపోషక శాస్త్ర విజ్ఞానఖని డా.యెలినేని రాఘవరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీవన తరంగిణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ పట్టు వదలని విక్రమార్కుడిలా రాఘవరావు చేసిన ప్రయోగాలు, యంత్రాల ఆవిష్కరణలు పశు పోషకుల అభ్యున్నతికి ఎంతో సహాయపడ్డాయని పేర్కొన్నారు. గౌరవ అతిథి ఇక్రిశాట్ సీనియర్ సైంటిస్ట్ (రిటైర్డ్) డా.సి.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ పశుపోషణ లాభదాయకంగా చేపట్టడంలో డా.రాఘవరావు ఇచ్చిన సలహాలు, సూచనలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. మరో గౌరవ అతిథి స్మైల్ ప్రాజెక్ట్, పశు సంవర్ధక శాఖ, అడిషనల్ డైరెక్టర్ డా. వై.సింహాచలం మాట్లాడుతూ డా.రాఘవరావు చేసిన ప్రయోగాలు, వృత్తిపరమైన విజయాలు అందరికీ ఆదర్శప్రాయమైనన్నారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.వి.కె. నరసింహారావు మాట్లాడుతూ డా.రాఘవరావు పరిశోధనా ఫలాల వల్ల ప్రయోజనం పొందిన ఎంతో మంది పాడిరైతుల తరపున ఆయనకు కృతజ్ఞతగా ఆయన జీవన గమనంపై ఒక పుస్తకం రూపకల్పన చేయాలనే ఆలోచనకు ప్రతిరూపమే ఈ 'జీవనతరంగిణి' అని అన్నారు. సన్మాన గ్రహీత డా.యేలినేని రాఘవరావు మాట్లాడుతూ తన జీవన గమనంలో టీచర్‌గా, పశువైద్యుడిగా, శాస్త్రవేత్తగా, పరిశోధకుడిగా, పశుపోషకుల అభివృద్ధి, పశుగణక్షేత్రాల అభివృద్ధి కోసం కృషి చేయడం తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని, తన జీవితకాలం అంతా మూగజీవాలకు సేవ చేసుకునే అదృష్టం కలిగినందుకు తాను గర్విస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు సీజీఎం (రిటైర్డ్) పి.మోహనయ్య, డా.కె.నరేంద్రబాబు, పంకజ్‌బదానా, డా.వి.రవీంద్రబాబు, చంద్రశేఖర్, ప్రసన్న కుమార్, డా.సింహాచలం, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్లు, మెంబర్లు, పరిసర గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్లు పరిశీలిస్తున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, ఈవో ప్రసాద్

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి

డ్రైవర్‌కు గాయాలు



కారులో గాయపడి మృతి చెందిన సురేష్

కె.కోటపాడు : సూదివలస జంక్షన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న బోకం సురేష్(33) సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు సురేష్ భార్య ఆమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్.ఐ లక్ష్మీనారాయణ కేసును నమోదు చేశారు. ప్రమాదంపై ఎస్.ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన మృతుడు బోకం సురేష్, లోకిరెడ్డి అప్పలరాజు కారులో కె.కోటపాడు వైపు బంధువుల ఇంటికి బయలుదేరారు. కారు సూదివలస కూడలి వద్దకు చేరుకునే సరికి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో పక్కన కూర్చున్న సురేష్ తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారు డ్రైవింగ్ చేస్తున్న అప్పలరాజుకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సురేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో మాస్టర్ అగస్త్య



మంత్రి అమర్‌నాథ్ నుంచి మెడల్, సర్టిఫికెట్‌ను అందుకుంటున్న మాస్టర్ అగస్త్య బజాజ్

అక్కిరెడ్డిపాలెం: 16 నెలల వయసులోనే పుస్తకాలను గుర్తు పట్టి.. వాటిలో పదాలను పలకడం, వస్తువులను గుర్తించడంలో నగరానికి చెందిన అగస్త్య బజాజ్ నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మిందిలోని తన నివాసంలో ఆదివారం బాలుడితో పాటు అతని తల్లిదండ్రులు అగస్త్య రవికుమార్ బజాజ్, సాక్షి బజాజ్‌లను అభినందించారు. అతి చిన్న వయసులోనే బాలుడి ప్రతిభ అద్భుతమని కొనియాడారు. బాలుడు తాతయ్య రాకేష్ కుమార్ బజాజ్, నాన్నమ్మ అల్పన బజాజ్, 72వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

టేకుతోటలో అగ్ని ప్రమాదం

మాడుగుల రూరల్: అవురువాడ పంచాయతీ శివారు తిరువాడ గ్రామ సమీపంలో గల సామాలకొండ, నాగాలుకొండ సమీపంలో గల టేకుతోటలో ఆదివారం ఆకతాయిలు నిప్పు అంటించారు. దీంతో టేకు తోటలో గడ్డి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, వీఆర్‌ఓ భరద్వాజ, పంచాయితీ కార్యదర్శి సింహచలం, అటవీశాఖ సిబ్బంది శేఖర్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పి వేశారు.

వైభవంగా రాముడి పెళ్లిరాట మహోత్సవం



పెళ్లిరాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: శ్రీరామనవమిని పురస్కరించుకుని రాముడి పెళ్లిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్థానిక రామాలయం వద్ద రాముడి పెళ్లిరాట మహోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామనవమిని ప్రతి గ్రామంలోనూ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదేరోజు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు.

టీడీపీ నేత ఇసుక ట్రాక్టరుపై కేసు నమోదు



స్టేషన్‌లో ఉన్న ఇసుకతో పట్టుబడిన ట్రాక్టరు

నాతవరం : తాండవ నదిలో అక్రమంగా తవ్వకాలు జరిపి ఇసుక తరలిస్తున్న టీడీపీ నేత జిల్లేడుపూడి సర్పంచ్ లాలం రమణ ట్రాక్టరును పోలీసులు పట్టుకున్నారు. గుమ్మడిగొండ సమీపంలో తాండవ నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాడు. దీనిపై గొలుగొండ ఎస్ఈబీ అధికారులకు సమాచారం వెళ్లడంతో ఎస్ఈబీ ఎస్ఐ రహీం నదిలో ట్రాక్టరుపై ఇసుక లోడు చేస్తుండగా పట్టుకుని నాతవరం పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. నాతవరం ఎస్ఐ రామారావు ఆదివారం కేసు నమోదు చేసినట్టుగా తెలిపారు. కొత్తగా వచ్చిన నిబంధనల ప్రకారం అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి రవాణా చేస్తున్న ట్రాక్టరుకు మొదటసారి పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు. మళ్లీ పట్టుబడితే ట్రాక్టరు డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. పట్టుబడిన ట్రాక్టరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు.